RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 108 | మార్చి 19, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ.. నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379





# వింత సమాధానాలు!

- మంత్రులూ..! బాధ్యత ఉండనక్కర్లేదా..?
- తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వినూత్న సంఘటనలు
- అసెంబ్లీలో సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రుల నుంచి అవాక్కయ్యే ఆన్సర్స్!
- అసెంబ్లీ బయట ఒకలా.. అసెంబ్లీ లోపల ఇంకొకలా మినిస్టర్స్ తీరు
- మంత్రుల సమాధానాలపై సభ్యులతో సహా రాజకీయ విశ్లేషకులు విమర్శలు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రోజుకో వినూత్న సంఘటన చోటు చేసుకుంటోంది. సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులిచ్చే సమాధానాలతో సభలో ఉన్నవాళ్లతో పాటు ఆ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న అందరూ అవాక్కవుతున్నారు.

### ఆదివారం వెబ్‌సైట్లు పని చేయవా?

అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్, విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు బకాయిల గురించి.. దానికి సంబంధించిన వెబ్‌సైట్లు పని చేయడం లేదని ప్రశ్న అడిగారు. దీనికి సమాధానంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేము ఎప్పటికప్పుడు సైట్లలో సమాచారాన్ని పొందుప రుస్తున్నాము. తమ ప్రభుత్వం వచ్చాక కొన్ని వేల మందికి ఫీజు బకాయిలు చెల్లించాము. స్కాలర్‌షిప్స్ నిధులు సైతం విడుదల చేస్తున్నాము. వెబ్‌సైట్‌లో సమాచారం లభించకపోవడానికి కారణం నిన్న ఆదివారం కాబట్టి సైట్లు పని చేయలేదు అని వింత సమాచారం ఇచ్చారు. ఈ సమాధానంతో అవాక్కవ్వడం గంగుల వంతైంది.

ఫ్రీ బస్ జర్నీ మినహా మిగతా మహిళల హామీల అమలెప్పుడు?

మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ..గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహిళలకు నెలకు రెండున్నర వేలు ఇస్తామన్నారు. కల్యాణ లక్ష్మీకింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదిహేను నెలలవుతున్న ఇంతవరకూ తులం బంగారం లేదు. మహిళలకు రెండున్నర వేల రూపాయలు ఇవ్వడం లేదు. అసలు ఈ పథకం అమలవుతుందా లేదా అని సమాధానమివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనికి సమాధానంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పట్లో ప్రతిపాదన లేదని పేర్కొన్నట్లు తెలుస్తోంది.

మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్ చాట్‌లో మాట్లాడుతూ.. బోర్ల కిందట పంట వేస్తే ఎండిన పంటకు తమ ప్రభుత్వం బాధ్యత వహించదు కానీ సాగునీళ్లు అందించే ప్రాజెక్టుల కింద ఎండిన ప్రతి గుంటకు తమ ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని చెప్పినట్లు మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి.. ఇలా మంత్రుల హోదాలో అది ప్రజల సమస్యలను పరిష్కరించి..వారికి ఏమి కావాలో చట్టాలు చేసే దేవాలయం లాంటి అసెంబ్లీలో మాట్లాడేటప్పుడు వెనక ముందు ఆలోచించాలి. ఓ సామాన్యుడు మాట్లాడే మాటను ఎవరూ అంత సీరీయస్ గా తీసుకోరు కానీ ప్రజలు ఓట్లేస్తే గెలిచి మంత్రులయిన నాయకులు మాట్లాడే ప్రతి మాటను గమనిస్తుంటారు.

ఎక్కడ ఏ చిన్నతప్పు దొర్లిన వదిలిపెట్టడం లేదు సోషల్ మీడియా.. ఇక ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ సోషల్ మీడియా గురించి అయితే వేరే చెప్పనక్కర్లేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుండి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వరకూ అందరూ తమ పార్టీ సోషల్ మీడియా కంటే బీఆర్ఎస్ సోషల్ మీడియా చాలా బలంగా ఉందని ఇప్పటికే పలుమార్లు నిజం ఒప్పుకున్నారు. అలాంటప్పుడు అధికార పార్టీకి చెందిన నేతలు.. ముఖ్యంగా మంత్రులు అది అసెంబ్లీలో మాట్లాడేటప్పుడు ఎంత జాగ్రత్తగా మాట్లాడాలి. ఎంత బాధ్యతయుతంగా ఉండాలని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.




## ఆర్థిక వ్యూహాలతోనే సమాజ పురోభివృద్ధి

**ప్రొఫెసర్ వాసుదేవ్ సెడెం**

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

అర్థశాస్త్రం కేవలం శాస్త్రం మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి జీవితంతో సంబంధం కలిగి ఉందని,మనం కేవలం విద్యతో కాకుండా,ఆర్థిక వ్యూహాలతో, ఆర్థిక దృష్టితో,సమాజాన్ని మరింత ముందుకు నడిపించాలని గుల్బర్గా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వాసుదేవ్ సెడెం పేర్కొన్నారు. కె.ఎన్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన రెండురోజుల జాతీయ సదస్సు చివరిరోజున ప్రిన్సిపల్ ఉపేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ సేమి నార్ ద్వారా మనం ఆర్థిక దృష్టితో కొత్త దారులను, సూత్రాలను, ఆలోచనల్ని సమర్థవంతంగా ఆవిష్కరించగలిగామని అన్నారు. ప్రారంభంలో మనం ఆర్థిక సూత్రాలపై వివిధ అంశాలను,సవాళ్లను మరియు ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై లోతైన చర్చలు జరిపామని,మనం చేసిన అధ్యయనం, అన్వేషణ,మరియు చర్చలు మనకు కొత్త జ్ఞానం మరియు అవగాహన ఇచ్చాయని

మిగతా 4వ పేజీలో..

# సీఎం రేవంత్‌కు సొంత పార్టీ ఎమ్మెల్యేల షాక్!



## ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయమేది?

**వేద న్యూస్, హైదరాబాద్ :**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఒకటి కాదు రెండు కాదు పదిహేను నెలలవుతుంది. ఇంతవరకూ ముఖ్యమంత్రి మంత్రుల మధ్య.. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సయోధ్య కుదరడం లేదా..? జాతీయ పార్టీ అంటేనే వర్గాలు అనే ముద్రను ఇంకా నిజం చేస్తున్నారా.. ? లేదా వీరివురి మధ్య సమన్వయం లోపించిందా అంటే.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మంత్రులు.. సీఎం.. అధికార పార్టీ సభ్యుల తీరును చూస్తుంటే అవుననే అనిపిస్తోంది.

### ఇరిగేషన్‌పై సీఎంది ఒక మాట.. మంత్రిది మరొక మాట..?

ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "పదేండ్ల పాలనలో కేసీఆర్ పది లక్షల కోట్ల అప్పులు చేశారు. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కట్టారు. అది కాళేశ్వరం కాదు కూలేశ్వరం అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత రోజు మండలిలో గవర్నర్ ప్రసంగం పై ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీ ప్రొ.కొదండరాం ఇరిగేషన్‌ను మంత్రిని కాళేశ్వరం ప్రాజెక్టు కూలింది. అన్నారం బ్యారెజ్, మేడిగడ్డ పనికిరాదని అంటున్నారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టుకు భద్రత ఉందా? అని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి డోకా లేదు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టే కాదు అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల, మల్లన్నసాగర్ ఇలా ప్రతిదీ భద్రంగానే ఉంటుంది. ఎలాంటి ప్రమాదం లేదని అధికారంగా జవాబు ఇచ్చారు.

### ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వలేదా?

తాజాగా ఇటీవల కాంగ్రెస్ లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీలో మాట్లాడుతూ ఒక ఎమ్మెల్యేగా నా అనుమతి లేకుండా.. నాకు కనీసం సమాచారం ఇవ్వకుండా నా నియోజకవర్గంలో ఓ సబ్ స్టేషన్ పనుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. నేను నా స్టైల్ లో వెళ్లి ఆ శంకుస్థాపన శిలపలకాన్ని పగులకొట్టాను సాక్షాత్తు సభలోనే అన్నారు.

### కరెంటు సమస్యలు..

మరో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నా నియోజకవర్గంలో రైసు మిల్లులు... ఇతరత్రా మిల్లులు ఎక్కువ..నా నియోజకవర్గంలో ఉదయం నుండి రాత్రి అనక పగలు అనక కరెంటు కోతలు.. కరెంటు హైవోల్టేజీ.. లోవోల్టేజీ సమస్యలున్నాయి. ఉప ముఖ్యమంత్రి.. సంబంధిత మంత్రి అయిన భట్టి విక్రమార్కని ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నట్లు స్పీకర్‌ను అభ్యర్థించారు. మరో ఎమ్మెల్యే.. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ

మిగతా 3వ పేజీలో..




## రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం

**బీసీ సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిరుద్యోగ యువతకు వినూత్న పథకాలు ప్రవేశపెట్టాలని చేస్తున్న కృషిలో భాగంగా "రాజీవ్ యువ వికాసం" అనే వినూత్న కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చిందని బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువ వికాస్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ఈ పథకం క్రింద నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడానికి బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ రుణం మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ నెంబర్, పాస్పోర్ట్ ఫోటో మొబైల్ నెంబర్లు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది అని అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం యువ వికాసానికి మార్చి 17 నుండి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని అన్నారు. ఏప్రిల్ 6 నుండి 30 వరకు లబ్ధిదారుల ఎంపిక యూనిట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. క్యాటగిరి-1 లో లక్ష వరకు రుణం 80శాతం రాయితీ, క్యాటగిరి రెండులో రెండు లక్షల వరకు సహాయం 70శాతం రాయితీ, మూడవ కేటగిరిలో మూడు లక్షల వరకు సహాయం 60 శాతం రాయితీ కల్పించడం జరుగుతుందని శ్రీకాంత్ అన్నారు. పాలన ప్రక్షాళన పారదర్శకత తమ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులకే పథకాలు ఇవ్వాలని లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ఆరంభించడం జరిగిందని. ప్రభుత్వం

మిగతా 4వ పేజీలో..

# జయ నర్సింగ్ కాలేజీ సీజ్

- మూడేళ్లుగా రూ.44 లక్షల ఆస్తి పన్ను చెల్లించని వైనం

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

గత మూడేళ్ళ గా మున్సిపల్ కార్పొరేషన్ కు బకాయి పడి ఉన్న ఆస్తి పన్ను రూ. 44 లక్షలు చెల్లించని కారణంగా కమిషనర్ ఆదేశాల మేరకు హన్మకొండ లోని జయ నర్సింగ్ కాలేజీని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ జయ నర్సింగ్ కళాశాల యాజమాన్యం కోర్టులో కేసు కొనసాగుతుందని చెబుతూనే నర్సింగ్ కళాశాలను నడుపుతున్నారని గుర్తించిన బల్దియా పన్నుల అధికారులు బకాయి పడి ఉన్న పన్నులు చెల్లించాలని కోరుతూ రెడ్ నోటీస్ జారీ చేయడం జరిగిందని, అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో మంగళవారం ఉదయం నర్సింగ్ కళాశాల విద్యార్థులను సిబ్బందిని బయటికి పంపించి కళాశాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. బల్దియా కు చెందిన అధికారులు గత వారం రోజులుగా ప్రాపర్టీ టాక్స్ చెల్లింపు విషయంలో ఇప్పటికే సుమారు 356 ప్రాపర్టీలను సీజ్ చేయడం జరిగిందని, నగర ప్రజలు ప్రాపర్టీ మరియు నల్లా బకాయి వెంటనే చెల్లించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ యూసుఫోద్దీన్, ఆర్ఐలు సురేష్, రజని, భరత్ చంద్ర శ్రీకాంత్, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# పెళ్లి కోసం నానా తంటాలు



## కులాంతర వివాహాలకు యత్నాలు

విజయవాడ : తెలుగు రాష్ట్రాల్లో ఓ తరానికి పెళ్లి అనేది పెద్ద సమస్యగా మారిపోయింది. ఏపీ, తెలంగాణల్లో కొన్ని కులాల్లో పెళ్లి చేసుకోడానికి ఆడపిల్లలు లేకపోవడంతో కులాంతర వివాహాలకు సైతం సై అంటున్నారు. దీంతో ఇదే అదనుగా నకిలీ ముఠాలు చెలరేగిపోతున్నాయి. తాజాగా జరిగిన ఓ ఉదంతంతో పోలీసులు, న్యాయవాదులు తలలు పట్టుకున్నారు. విజయవాడ శివార్లలోని గ్రామానికి చెందిన ఓ యువతికి నగరంలోని పాతబస్తీ ప్రాంతానికి చెందిన యువకుడితో వివాహం జరిగింది. వారికి మూడున్నరేళ్ల వయసు ఉన్న కుమార్తె కూడా ఉంది. కోవిడ్‌కు ముందు వరకు యువకుడు కుటుంబ వారసత్వంగా వచ్చిన వ్యాపారాలు చేసేవాడు. కోవిడ్ కు కొద్ది నెలల ముంద వ్యాపారాల్లో అంతగా లాభాలు రావడం లేదంటూ యువతి భర్తపై ఒత్తిడి చేసి దుస్తుల వ్యాపారం ప్రారంభించింది. విజయవాడ శివార్లలోని కొండపల్లిలో ఏర్పాటు చేసిన దుస్తుల షోరూమ్ నిర్వహణ కోసం సొంత డబ్బుతో పాటు అధిక వడ్డీలకు అప్పులు చేశారు. డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెట్టేశారు. ఈలోగా కోవిడ్ రావడంతో వ్యాపారం కాస్త దివాళా తీసింది. వ్యాపారాల కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. ఈ క్రమంలో భార్యా భర్తల మధ్య విభేదాలు మొదలయ్యాయి. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లి పోయింది. వ్యాపారం కోసం ఆమెకు అప్పులిచ్చిన కాల్ మనీ బ్యాచ్ గత ఏడాది జూన్‌లో డబ్బు కోసం ఓ కొత్త పథకం చెప్పి ఆమెను ఒప్పించారు. విజయవాడలో ఆర్గనైజ్డ్ నేరాలకు పాల్పడుతున్న ముఠాలు కొంత కాలంగా పెళ్లిళ్ల పేరుతో మోసాలకు పాల్పడుతున్నాయి. నల్గొండ జిల్లాలో సంపన్న కుటుంబానికి చెందిన ఓ యువకుడికి 30 దాటినా పెళ్లి కావడం లేదు. ఆంధ్రా, తెలంగాణలో ఎక్కడ అమ్మాయి ఉన్నా ఎదురు కట్నం ఇచ్చి చేసుకుంటానని బ్రోకర్లకు చెప్పాడు. సంబంధం కుదిరిస్తే రూ.5లక్షల కమిషన్ ఆఫర్ చేశాడు. అది కాస్త విజయవాడలో ఆర్థిక నేరాలకు పాల్పడే ముఠాకు చేరింది. దీంతో అప్పుల పాలైన విజయవాడకు చెందిన వివాహితను పెళ్లి డ్రామాకు ఒప్పించారు. పెళ్లి చేసుకుని ఏదొక సాకు చెప్పి వచ్చేస్తే లక్షన్నర ఇస్తామని యువతిని ప్రలోభ పెట్టారు. ఆర్థిక ఇబ్బందులు తీరుతాయని వారి ప్రతిపాదనకు యువతి సై అంది. గత ఏడాది విజయవాడలోనే పెళ్లి చూపులు కూడా ఏర్పాటు చేశారు. నల్గొండ యువకుడు తన బంధువులతో కలిసి రావడం, యువతి నచ్చడంతో పెళ్లికి సై అన్నాడు. యువతికి తల్లిదండ్రులు లేరని చెప్పడంతో ఎగిరి గంతేశాడు. గత ఏడాది జూన్‌లో నల్గొండలో అంగరంగ వైభవంగా పెళ్లి జరిగింది. పెళ్లైన రెండు మూడు రోజులకు యువతి తనకు అప్పులు ఉన్నాయని చెప్పడంతో వాటిని తాను తీరుస్తానని చెప్పి రూ.7లక్షలు ఆమెకు ఇచ్చాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు యువతి హైదరాబాద్ వెళ్లిపోయింది. హైదరాబాద్ వెళ్లిన యువతి తిరిగి నల్గొండలో ఉంటున్న భర్త దగ్గరకు రాక పోవడంతో అతను అనుమానించి ఆరా తీశాడు. దీంతో ఆమెకు అప్పటికే పెళ్లై నాలుగేళ్ల కుమార్తె కూడా ఉందని, భర్తకు దూరంగా ఉంటున్నట్టు తెలియడంతో తనతో కాపురానికి రావాలని ఆమెను ఒత్తిడి చేశాడు. నల్గొండ యువకుడి దగ్గర లక్షలు వసూలు చేసిన యువతి ఆ తర్వాత మరో యువకుడు పరిచయం అయ్యాడు. విశాఖ నుంచి గంజాయి రవాణా చేస్తే మంచి కమిషన్ ఇస్తానని ఆఫర్ చేశాడు. ఈ క్రమంలో గంజాయి రవాణా చేస్తూ కొద్ది నెలల క్రితం విశాఖ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడింది. దీంతో రెండు నెలలు జైల్లో ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆ యువతి కోసం ఆమె మొదటి భర్త, రెండో భర్త వెదుకులాట ప్రారంభించారు. ఈలోగా ఆమెకు అప్పులిచ్చిన కాల్‌మనీ ముఠా బెయిల్‌పై ఆమెను బయటకు తీసుకొచ్చింది. ఈ క్రమంలో యువతి చేతిలో మోసపోయిన నల్గొండ యువకుడు పెళ్లి సంబంధం తీసుకొచ్చిన మధ్యవర్తుల్ని నిలదీయడంతో కొత్త డ్రామా మొదలైంది. మరోవైపు యువతి మొదటి భర్త తన భార్యను ఈ కేసు నుంచి కాపాడాలంటూ న్యాయవాదుల్ని ఆశ్రయించాడు. ఈ క్రమంలో యువతి వెనుక డ్రామా నడిపిన ముఠా ఇదే తరహాలో పెళ్లి కాని యువకుల్ని మోసం చేస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పెళ్లి కోసం తీవ్ర ప్రయత్నాలు చేసే వారిని గుర్తించి పెళ్లి తంతు నడిపించడం ఆ తర్వాత ఏదొక వంకతో గొడవ పెట్టుకుని అందిన కాడికి తీసుకుని పారిపోవడం చేస్తున్నట్టు గుర్తించారు. పెళ్లి కాకపోతే ఊళ్లో పరువు పోతుందని ముందు, వెనుక ఆరా తీయకుండా పెళ్లిళ్లు చేసుకుంటే ఆ తర్వాత పోలీసులు, కోర్టులు చుట్టూ తిరగాల్సి రావొచ్చు.

# రాములమ్మ దూకుడు షురూ..



హైదరాబాద్ : రాజకీయాల్లో శాశ్వత శత్రవులు, శాశ్వత మిత్రులు వుండరు. ప్రస్తుత రాజకీయాల్లో ఎవరు, ఎప్పుడు ఏ పార్టీ వైపు మారుతారో చెప్పడం కష్టమే. అలా ఉన్నాయి రాజకీయాలు కూడా. కేవలం తెలుగు రాష్ట్రాలకు మాత్రమే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. కాకపోతే తెలంగాణలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. తెలంగాణ కాంగ్రెస్‌లో ఫైర్ బ్రాండ్ విజయశాంతి. దాదాపు 15 ఏళ్ల తర్వాత ఆమె పదవి అందుకున్నారు. అంతకుముందు టీఆర్ఎస్ తరపున మెదక్ నుంచి ఎంపీగా గెలుపొందారు. మారిన రాజకీయాల నేపథ్యంలో గత ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో అడుగుపెట్టారు. స్టార్ క్యాంపెయిన్‌గా చాలా నియోజకవర్గాలను తిరిగారు. ఎమ్మెల్యే కోటాలో ఆమెకు ఎమ్మెల్సీ సీటు ఇచ్చింది కాంగ్రెస్. రాములమ్మ సేవలు ఎమ్మెల్సీగా కాకుండా మరింత విస్తృతం చేయాలని పార్టీ పెద్దలు ఆలోచన చేస్తున్నారట. ఈ క్రమంలో విజయశాంతికి హైకమాండ్ కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు ఓ వార్త హంగామా చేస్తోంది. రేవంత్ కేబినెట్‌లో చోటు కల్పించబోతున్నట్టు తెలుస్తోంది. కేబినెట్‌లోకి తీసుకున్న తర్వాత ఆమెకి ఏ పదవి ఇస్తారనే దానిపై రకరకాలుగా ప్రచారం సాగుతోంది. రేవంత్ కేబినెట్‌లో దాదాపు ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఏడాదిగా వాటిని భర్తీ చేస్తారని ప్రచారం సాగింది. ఇప్పటివరకు పెండింగ్‌లో పడుతూ వస్తోంది. కేబినెట్ విస్తరణలో రాములమ్మతోపాటు మిగతా నేతలకు పదవులు ఇస్తారని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విజయశాంతికి మంత్రి పదవిని ఇవ్వడం ద్వారా పార్టీకి అడ్వాంటేజ్ అవుతుందని హైకమాండ్ లెక్కలు వేస్తోంది. ఏకగ్రీవంగా విజయశాంతి ఎన్నికైనట్టు ప్రకటించగానే గురువారం సాయంత్రం మీడియా ముందుకు వచ్చేశారు విజయశాంతి. బీజేపీతోపాటు బీఆర్ఎస్‌పై ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ ఏం చేసింది.. గతంలో కేసీఆర్ ఏమి చేశారు? మొత్తం గుట్టు విప్పి బయటపెట్టారు. ఈ రెండు పార్టీలకు తాను సేవలు అందించానని, సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే పార్టీ నుంచి బయటకు రావాల్సి వచ్చిందన్నారు. తాను ఎమ్మెల్సీ అయినందుకు ఎందుకు బాధపడుతున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. ప్రస్తుతం రాములమ్మ వ్యవహారశైలిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జాగ్రత్తగా గమనిస్తున్నారు. ఆమె మాట్లాడిన ప్రతీ మాటను గమనిస్తున్నారు. గతంలో జరిగిన విషయాలు ఆమె బయట పెట్టడంతో ప్రస్తుతానికి ఆ పార్టీ నేతలు నోరు మెదపలేదు. ఎందుకంటే గతంలో ఏం జరిగిందో ఇప్పుడున్న నేతల్లో కొంతమంది మాత్రమే తెలుసు. అసెంబ్లీ సమావేశాల తర్వాత పార్టీ నేతలతో సమావేశం కావాలని నిర్ణయించారట కేసీఆర్. దీనిపై ఆ పార్టీ నుంచి ఓ ఫీలర్ బయటకు వచ్చింది. విజయశాంతికి ఏ విధంగా చెక్ పెట్టాలని దానిపై వ్యూహ రచన చేస్తున్నారట. ఆమెని కంట్రోల్ చేయకుంటే పార్టీకి ఇబ్బందులు తప్పవని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాది సీఎం రేవంత్‌రెడ్డి దూకుడుగా వెళ్లారు. సెకండ్ ఇయర్ రాములమ్మ వంతు కానుంది. జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నారు కారు పార్టీ నేతలు. ఈమెని ఎదుర్కోవడం అంత ఈజీ కాదన్న రీసౌండ్ కారు పార్టీలో అప్పుడే మొదలైపోయింది. మొత్తానికి రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి.

# మురికి కాలువల్లోకి మిషన్ భగీరథ నీళ్లు

- లీకులు సరి చేయరు... మరమ్మతుల ఊసు లేదు
- సిబ్బంది నిర్లక్ష్యం అధికారుల పట్టింపు లేని తనం
- రోజు గంటల తరబడి వేల లీటర్లు నీరు వృధా
- నీటి వృధా అరికట్టకపోతే వేసవి కష్టాలు తప్పవు
- జిల్లా కేంద్రంలో ఎక్కడైనా ఇదే కథ



పెద్దపల్లి : మంచి లక్ష్యంతో ప్రతిష్టత్మాకంగా మొదలైన మిషన్ భగీరథ ఇంటింటికి నల్లా నీరు పెద్దపల్లి జిల్లాతో పాటు పెద్దపల్లిలో నిర్వహణ లోపం, అసంపూర్తి పనులు, కాంట్రాక్టర్ల అవినీతి, అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంతో ఇప్పటికి అబాసు పాలవుతూనే ఉన్నది. పెద్దపల్లి పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరా, పర్యవేక్షణ అధికారం మున్సిపల్ కమిషనర్ అధీనం లో ఉన్నది. మున్సిపల్ లో 36 వార్డులు ఉండగా నీటి సరఫరా నీటి సరఫరాను ప్రతి వార్డులోని ఆయా గల్లీలకు రోజు వారి పద్ధతిలో వదులుతున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా, అసలు సమస్య నిత్యం కొన్ని వేల లీటర్లు వృధాగా పోతూనే ఉన్నాయి. కాంట్రాక్టర్లు పంపుల బిగింపు సరిగా చేయక పోవడం, దానికి తోడు నీటి అవసరం లేని వాళ్ళకు కూడా పైపులు బిగించారు. దీంతో పలు వార్డుల్లో ప్రజలు నీటి లీకేజి సమస్యలతో ఇబ్బందులు పడుతుండగా, నీటి అవసరం లేని వాళ్ళు మాత్రం సదరు భగీరథ మంచినీటిని మురికి కాలువలు, సెప్టిక్ ట్యాంక్ ల్లోకి వదిలి పెడుతున్నారు. దీంతో పలు వార్డుల్లో రోజు కొన్ని వేల లీటర్లు మంచి నీరు వృధాగా పోతున్నాయి. ఇక నీటిని వదిలే సిబ్బంది సమయ పాలన లేకపోవడం మరి దారుణం. నీటిని వదిలితే సుమారు రెండు గంటల వరకు కూడా నీరు వృధాగా పోతున్నా పట్టించుకోరు. తమ డ్యూటీ వదలడం, నిలిపివేయడం మాత్రమే అంటున్నారు. అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా వారి జాడ ఎక్కడ కానరావడం లేదు. ఇలా ప్రతి నిత్యం 36 వార్డుల్లో కొన్ని వేల లీటర్లు నీరు వృధాగా పోతున్నా నివారణ చర్యలు శూన్యం. అసలే ఎండా కాలం ఇంకా రెండు నెలలు బానుని తీవ్రత పెరుగు తున్నది. నీటి కష్టాలు కొన్ని ప్రాంతాల్లో ప్రారంభమైనా, ఇక్కడి మున్సిపల్ అధికారులకు మాత్రం విధి నిర్వహణ మరిచిపోయినట్లు ఉన్నారు. దీనికి తోడు ప్రతి వార్డులో నీటి లికేజీలు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడ మరమ్మ తులు చేసినా అవి లాంటి ఫలితాలు ఇవ్వకపోగా భారీ ఎత్తున నీటి లీకేజిలతో చిన్నపాటి కాలువలు తలపిస్తున్నాయి. ప్రతినిత్యం పట్టణంలో తిరిగే అధికారు లకు ఈ దృశ్యాలు ఎందుకు కనిపించడం లేదో అర్థం కానీ ప్రశ్న. జిల్లా అధికారుల సమీక్షలు కూడా వీరి నిర్లక్ష్యంతో వృధా ప్రయాసే అవుతున్నది. పట్టణంలోని అమర్ నగర్, సుభాష్ నగర్, జెండా చౌరస్తా గల్లీ, తెనుగువాడ ఇలా చెప్పుకుంటూ పోతే ఏ వార్డు పరిశీలించిన ఇదే తంతు కొనసాగుతున్నది. ఆలాగే రోడ్డు మీద చాలా మంది భగీరథ నీరును వాహనాలు శుభ్రం చేసుకోవడం తదితర పనులకు వినియోగించు కోవడం కూడా జరుగుతున్నది. ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చేలా కొన్ని కోట్ల వ్యయంతో బృహత్తార పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంటే, అధికారుల నిర్లక్ష్యం మూలంగా వృధా అవుతున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నీటి వృధాను, లీకేజిలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. వేసవి నీటి కష్టాలు రాకముందే మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# దావాజీపల్లి ప్రైమరీ స్కూలు దృష్టి పెట్టాలి

వనపర్తి : ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో దృష్టి పెట్టండి. లక్షల కోట్ల అప్పులలో కనీసం వెయ్యి కోట్ల పెడితే విద్యార్థులకు మేలు అవుతుంది కదా? జిల్లాకు కూత వేటు దూరంలో ఉన్న దావాజిపల్లి ప్రైమరీ స్కూల్ పై చిన్న చూపేలా అరి మంత్రి జూపల్లి కి అఖిలపక్ష ఐక్యవేదిక విన్నవించింది. పానుగల్ మండలంలోని దావాజిపల్లి గ్రామ ప్రజల, మరియు విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు దావాజిపల్లి లోని ప్రైమరీ స్కూల్ ను అఖిలపక్ష ఐక్యవేదిక సందర్శించడం జరిగింది. అక్కడ విద్యార్థులకు సరైన భవనం లేక , ఉన్న భవనానికి కాంపౌండ్ వార్డు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అలాగే విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలకు కోరుతున్నారని జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు ఇదేవిధంగా ఉండి అవస్థలు పడుతున్నారని, కొన్ని స్కూళ్లలో సరైన రూములు లేక ఆరు బయట కూర్చుంటున్నారని, ప్రభుత్వం అనవసరమైన ఖర్చులు తగ్గించి విద్యార్థులకు మరియు వైద్యానికి ఖర్చు చేయాలని ఈ సందర్భంగా ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నదని, స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి వీటిపై శ్రద్ధ వహించి విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, బిసి జిల్లా సంఘం నేత గౌనికాడి యాదయ్య, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, బొడ్డుపల్లి సతీష్, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీసే వేదిక యువ ఉత్సవ్

**- జిల్లా కేంద్రంలో నిర్వహించిన నెహ్రూ యువకేంద్ర మై భారత్**



జయశంకర్ భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విద్యార్థులతో పాటుగా యువతలో ఉన్న వివిధ రకాలనైపుణ్యాలు వెలికితీసే వేదికగా నెహ్రూ యువకేంద్రం, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్ నిలిచిందని జిల్లా విద్యాధికారి రాజేందర్ ప్రశంసించారు. జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ ఉ పీజీ కళాశాలలో కార్యక్రమ నిర్వాహకులైన నెహ్రూ యువకేంద్ర మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ మాట్లాడుతూ, పంచప్రాణ్ అనే అంశాలతో ఏడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. భారత ప్రభుత్వం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలిచే లక్ష్యంతో చేస్తున్న కృషిలో భాగంగా యువ ఉత్సవ్‌లో విద్యార్థులను భాగం చేస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం చేపడుతున్న కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం సంతోషకరం అని అన్నారు. యువ ఉత్సవ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంగా జిల్లా విద్యాధికారి రాజేందర్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యా సంబంధమైన అంశాలతో పాటుగా ఇతర అంశాల్లోనూ నైపుణ్యాలు కలిగి ఉండాలని సూచించారు. ఆయా నైపుణ్యాలను వెలికితీసే విధంగా నెహ్రూ యువకేంద్ర మై భారత్ యు వ ఉత్సవ్ నిలిచిందని కొనియాడారు. ఏడు పోటీలలో పాల్గొన్న విజేతలకు అభినందనలు తెలిపారు. జిల్లా యువజన సంక్షేమాధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని ప్రశంసించారు. యువతీ యువకులు ఇలాంటి అవకాశాలు ఉపయోగించుకోవాలని సూచించారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్ సూరునేని మాట్లాడుతూ, యువత చదువుతో పాటుగా పోటీ పరీక్షలు, వ్యక్తిత్వ వికాసం అంశాలపై సైతం దృష్టి పెట్టాలని కోరారు. విజేతలుగా నిలిచే విధంగా వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా సైన్స్ అధికారి స్వామి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హరికృష్ణ, అధ్యాపక బృందం, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులను కాపాడాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు

- **టిఆర్ఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు హింగే బాస్కర్**

**వేద న్యూస్, వరంగల్ :**

ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామంలో నష్టపోయిన రైతులు భూగర్భ జలాలు అడుగంటిపోయి ఎండిన వరి పంట పొలాలను టిఆర్ఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. సందర్భంగా హింగే భాస్కర్ మాట్లాడుతూ. వరి పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రైతులు ఆరుగాలం శ్రమించి, అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి, పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర మానసిక ఆవేదనతో, రైతులు పురుగుల మందు పట్టుకొని దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రభుత్వం ముందు చూపు లేకుండా యాసంగి సీజన్ ప్రారంభంలో రైతులను అవేర్నెస్ చేసి ప్రత్యమన్యయ పంటలు సాగు చేసేటట్టు చేయలేకపోవడం. అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలు చేయకపోవడం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన రైతుల పాలిట శాపంగా మారింది అని అన్నారు. అధికారులు యుద్ధ ప్రతిపాదికన గ్రామాలను పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి, నష్టపోయిన రైతులకు ఎకరాకు 40000 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి మండల అధ్యక్షులు కొక్కు తిరుపతి, ప్రధాన కార్యదర్శి కోదాటి మాధవరావు, నష్టపోయిన రైతులు సిద్దూరి మాధవరావు, వెల్తూరి స్వామి, కర్రె రాజు, రుద్రారపు బాపు, మేకల మల్లయ్య, రేణి కుంట్ల సాగర్, సోనబోయిన మునీందర్, తాళ్ల కుమారస్వామి, జూపాక యాకూబ్, బోడ సందీప్, బోడ వెంకన్న, కోదాటి దేవేందర్ రావు, లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



# ఆదివాసి కుటుంబాలకు పోలీసుల అండ

**సకల సమస్యలకు,చదువే సర్వరోగ నివారిణి - మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్**

**ఎల్లవేళలా మీకు అందుబాటులో పోలీస్ శాఖ**

**రాబిన్ హుడ్ ఆర్మీ యన్.జి.ఓ స్నోమ్యాన్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ**

**హాజరైన ఆదివాసి గ్రామాల ప్రజానీకం**




తాండూర్ : మనకు నిత్య జీవితంలో ఎదురయ్యే సకల సమస్యలకు చదువే సర్వరోగ నివారిణి అని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ అన్నారు. ఈ మేరకు శనివారం తాండూరు మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయితీ లోని బెజ్జల గ్రామంలో పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వారి వారి వ్యాపారాలు చూసుకుంటూనే ఆదివాసి గ్రామాల ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో ముందుకు వచ్చిన రాబిన్ హుడ్ ఆర్మీ యన్.జి.ఓ స్నోమ్యాన్ ప్రాజెక్ట్ వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ వారిని అభినందించారు. ప్రభుత్వం అన్ని విధాల సౌకర్యాలు కల్పించినప్పటికీ మన పిల్లలను చదువుకు దూరంగా ఉంచడం సరికాదని ఆయన గ్రామ ప్రజలకు సూచించారు. ఈ దేశ మూలవాసులు ఆదివాసులేనని ఆయన స్పష్టం చేశారు. ఆదివాసీలకు ఉన్న చరిత్ర ఎంతో చారిత్రాత్మకమైనదన్నారు. మన ఆదివాసి గూడాల నుండి చైతన్యవంతుడైన కొమరం బీమ్ ను ఆదర్శంగా తీసుకొని మన పిల్లలను ఎదగనివ్వాలన్నారు. పదవ తరగతి నుండి పై చదువులకు కూడా వసతిగృహాలు అందుబాటులో ఉన్నాయి. కనుక ఉద్యోగం వచ్చేవరకు వారిని చదవమని ప్రోత్సహించాలన్నారు. ఒక గ్రామంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉ ంటే ఆ ప్రభావం ఆ గ్రామం పైన కాకుండా చుట్టుపక్కల గ్రామాల పైన కూడా పడుతుందన్నారు. భవిష్యత్తులో ఈ గ్రామాల నుండి ప్రభుత్వ ఉద్యోగులు రావాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇక్కడి ఎస్ఐ, సిఐలు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ గ్రామాల్లో చదువులో రాణిస్తున్న విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని ఆయన సూచించారు. అంతకుముందు ఆదివాసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి కష్టం వచ్చినా ఎల్లవేళలా పోలీస్ శాఖ వారికి అందుబాటులో ఉంటుందని వారు పోలీసులను సంప్రదించాలనినసూచించారు. ఆదివాసులు అసాంఘిక శక్తులకు దూరముగా ఉండాలని ,గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు కనిపించిన పోలిసులకు తెలియజేయాలన్నారు. ప్రజలకు కేవలం శాంతిభద్రతల సమస్య కాకుండా ఇతర సమస్యలున్నా నిర్భయంగా పోలీస్ స్టేషన్కు వచ్చి తమ సమస్యలు వివరించి నట్లయితే వాటి పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

అనంతరం రాబిన్ హుడ్ ఆర్మీ యన్.జి.ఓ మరియు స్నోమ్యాన్ వారు పంపిణీ కోసం తెచ్చిన నిత్యవసర సరుకులు ఆదివాసి గ్రామాల ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవి కుమార్, తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి,ఎస్సైలు సౌజన్య, కిరణ్ కుమార్,విజయ్,గంగారం, రాబిన్ హుడ్ ఆర్మీ యన్.జి.ఓ వాలంటరీ రమేష్, మాజీ ఎంపీటీసి సూరం రవీందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెలగని వీధిలైట్లు...?

వేద న్యూస్, కమలాపూర్ :



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోనీ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ఎదురుగా సర్వ శిక్ష అభియాన్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల పక్కన కాసింపల్లి అనే కాలనీకి వెళ్లే మూలమలుపు నుండి ఎస్సీ హాస్టల్ మీదుగా కాసింపల్లి కాలనీ వరకు వెళ్లే మార్గంలో ఒక్క వీధిలైటు కూడా వెలగకపోవడంతో దారి అంతా చిమ్మ చీకటి కమ్ముకుంది. ఇంతకుముందు కాసింపల్లి కాలనీకి వెళ్లే మూలమలుపు నుండి శనిగరపు రత్నాకర్ అనే వ్యక్తి ఇంటి వరకు ఉన్న ఐదు స్తంభాలకు సంబంధించిన వీధిలైట్లు గత 15 రోజుల నుంచి వెలగట్లేదనీ, చీకటి అయిందంటే తమ ఇళ్లకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఎస్సీ హాస్టల్ కు సంబంధించిన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకొనుట కొరకు ఎప్పటికీ ఈ దారి గుండానే ఎస్సీ హాస్టల్ కు వెళుతుంటారు. వారికి కూడా చీకటి అయిందంటే ఆ దారి గుండా వెళ్లాలంటే భయపడిపోయే పరిస్థితి తలెత్తింది. కాసింపల్లి కాలనీ ప్రజలకు ఉన్న ఏకైక మార్గం ఇదొక్కటే. హుజురాబాద్ - పరకాల ప్రధాన రహదారి కమలాపూర్ మండల కేంద్రంలోని కాసింపల్లి మూలమలుపు నుండి ఎస్సీ హాస్టల్, కాశీంపల్లి కాలనీ వరకు పూర్తిస్థాయిలో వీధిలైట్లు అమర్చి కాలనీవాసులకు, బాటసారులకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యేల షాక్!

మొదటి పేజీ తరువాయి

నల్లగొండ నియోజకవర్గంలో తాగడానికి గుక్కెడు నీళ్లు లేవు. నీళ్ల సమస్య ఉందని చెప్తారు.

### మిషన్ భగీరథపై ప్రశ్నలు..

తెలంగాణ ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలనలో మొదటి ఆరు నెలల్లోనే ఎలాంటి కరెంటు సమస్యలు లేకుండా అన్ని రంగాలకు ఇరవై నాలుగంటల కరెంటును సరఫరా చేసింది. అప్పటి వరకూ ఫ్లోరైడ్ జిల్లాగా ముద్రపడిన నల్లగొండ జిల్లాతో పాటు యావత్ తెలంగాణలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథతో నల్లా ద్వారా తాగునీళ్లిచ్చింది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ సమావేశాలు జరిగిన ప్రతిసారి నా నియోజకవర్గంలో ఆ అభివృద్ధి కార్యక్రమాలు కావాలి.. ఇవి కావాలి అని అడిగారు తప్పా నా నియోజకవర్గంలో కరెంటు సమస్యలు.. తాగునీటి సమస్యలు ఉన్నాయని ఏ సభ్యుడు అడగలేదు.

### ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు పునరావృతం?

కానీ కాంగ్రెస్ పదిహేను నెలల పాలనలో మళ్లీ ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు పునరావృతం అయ్యాయా? లేదా ఎమ్మెల్యేల మంత్రుల ముఖ్యమంత్రి మధ్య సమన్వయం లోపించిందా అనేది అధికార పార్టీ ఆలోచించుకోవాలి. ఇప్పటికే అన్ని వర్గాల నుండి తీవ్ర వ్యతిరేకతను మూట కట్టుకున్న అధికార పార్టీ తీరా స్వయంగా తమ పార్టీ సభ్యులే నిండు అసెంబ్లీలో ఈ సమస్యలను ఎకరవు పెట్టడం బయట ఉన్న వ్యతిరేకతను ఒప్పుకున్నట్లేగా..

# ప్రతిపక్ష పాత్ర పోషించే ఉద్దేశ్యం లేదా...

హైదరాబాద్ : అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తానని పార్టీ వర్గాలతో చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ అసెంబ్లీకి డుమ్మాకొట్టారు? రెండు సార్లు పవర్‌లో ఉన్నప్పుడు అసెంబ్లీలో విపక్షాలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిన గులాబీ బాస్.. ఇప్పుడు ప్రతిపక్షనేత పాత్ర పోషించడానికి వెనకాడుతున్నారు .. గత బడ్జెట్ సమావేశాల్లో వ్యహరించినట్లు ఈ సారి కూడా గవర్నర్ ప్రసంగం రోజు హాజరు వేయించుకుని వెళ్లిపోయారు.. తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి.. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత హోదాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారా? లేదా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూశారు. ఇటీవల బీఆర్ఎస్ వర్గాల ముందు ఈ సారి అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతానని కేసీఆర్ ప్రకటించినట్లు ప్రచారం జరిగింది.. దానికి తగ్గట్లేఅసెంబ్లీ సమావేశాల ముందు రోజు కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చారు.. సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణభవన్‌కు వచ్చిన కేసీఆర్...అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై తనపార్టీ సభ్యులకు కేసీఆర్ దిశా నిర్ధేశం చేశారంట.దాంతో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు స్టార్ట్ అయినప్పటి నుంచి కేసీఆర్‌పైనే అందరి దృష్టి పడింది. అనుకున్నట్లే సభకు హాజరైన గులాబీబాస్ గవర్నర్ ప్రసంగం రోజున సభలో కనిపించారు. ఆరు నెలల తర్వాత సభకు వచ్చిన కేసీఆర్ ప్రతిపక్ష నేత హోదాలో బీఏసీ సమావేశానికి హాజరుకాలేదు.. రెండవరోజు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం జరిగినా కేసీఆర్ డుమ్మా కొట్టడం



చర్చనీయంశంగా మారింది. ఆ క్రమంలో సభా ప్రాంగణంలో ఎవరిని కదిపినా కేసీఆర్ అసెంబ్లీ హాజరుపైనే చర్చ నడుస్తుంది.గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగేటప్పుడు.. బీఆర్ఎస్ తరఫున కేసీఆర్ మాట్లాడతారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆయన అసలు అసెంబ్లీకే హాజరుకాలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక తొలి శాసన సభ సమావేశాలు జరిగినప్పుడు తుంటికి గాయం కారణంగా ఆస్పత్రిలో చేరిన కేసీఆర్ సభకు హాజరుకాలేదు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారానికి అసెంబ్లీకి వచ్చి వెళ్లిన ఆయన గత ఏడాది బడ్జెట్ సమావేశాల్లో కూడా ఒక్క రోజు హాజరు వేయించుకుని వెళ్లిపోయారు. ఆయన ఈ సారి బడ్జెట్ సమావేశాలకు హాజరుకానున్నారని పెద్దఎత్తున బీఆర్ఎస్ వర్గాలు ప్రచారం చేశాయి. కానీ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు గవర్నర్ ప్రసంగానికి హాజరై.. రెండోరోజు సభకు రాకుండా ఆయన ముఖం చాటేశారు. అయితే ఈనెల 19న బడ్జెట్ ప్రవేశ పెట్టే సంద ర్భంగా కేసీఆర్ సభకు వచ్చే అవకాశాలున్నాయని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తమకు ఈ సారి అధికారం కట్టబట్టలేదనే కోపంతో కేసీఆర్ జనాలపై అలుగుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గెలుపు ఓటములు సహజమని.. ఇప్పటి నుంచే ఆయన ప్రజా సమస్యలపై గళం విప్పితే.. జనం హర్షిస్తారని సూచిస్తున్నారు.ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఎమ్మెల్యేలందరూ కేసీఆర్‌ను అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కేవలం అసెంబ్లీకి రాకుంటే స్పీకర్ చర్యలు తీసుకుంటారన్న భయంతో ఆరు నెలలకు ఒక సారి వచ్చి వెళ్లడం తప్ప.. ఆయనకు సభలో ప్రతిపక్ష నేత పాత్ర పోషించే ఉద్దేశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆ క్రమంలో కేసీఆర్ ప్రతిపక్ష నేతగా జీతభత్యాలు పొందుతూ అసెంబ్లీకి రావడం లేదంటూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ , అసెంబ్లీ సెక్రటరీకి హస్తం పార్టీ నేతలు ఫిర్యాదు చేసే వరకు వచ్చింది పరిస్థితి. ఆయినా ఆయన తిరిగి అసెంబ్లీకి డుమ్మా కొట్టడం అటు పొలిటికల్ సర్కిల్స్‌తో పాటు పబ్లిక్‌లోనూ విమర్శలపాలవుతోంది.

# భారీగా పెరిగిన భూముల రేట్లు

వరంగల్ : వరంగల్ జిల్లా మామునూరులో విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయమై కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తన అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రకటించారు. మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, పౌర విమానయాన శాఖలు, అలాగే జీఎంఆర్ సంస్థ మధ్య ఎన్నో చర్చలు జరిగాయి. ముందుగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో విమానాశ్రయం నిర్మించకూడదని జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉన్నప్పటికీ.. కేంద్రం, రాష్ట్రం జీఎంఆర్ సంస్థను ఒప్పించి మామునూరులో విమానాశ్రయ నిర్మాణం చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయంతో పాటు.. మామునూరు నుంచి వర్ధన్నపేట, ఐనవోలు మండలాల వరకు.. అలాగే కాజీపేట మండలంలోని ఉర్సుగుట్ట నుంచి భట్టుపల్లి ప్రాంతం వరకు రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు మరింత గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్, భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో భూముల ధరలు అనూహ్యంగా పెరిగాయి. ముఖ్యంగా.. మామునూరు ప్రధాన రహదారికి అనుసంధానమయ్యే ప్రాంతాల్లో భూముల ధరలు గజానికి రూ.10,000 నుంచి రూ.11,000 మధ్య ఉంటే, ప్రస్తుతం ఆ ధరలు గజానికి రూ.22,000 నుంచి రూ.25,000 దాకా పెరిగాయి. వరంగల్ నుంచి ఖమ్మం వెళ్లే ప్రాంతంలో ఎకరం భూమి దాదాపు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల మధ్య పలుకుతుండటం గమనార్హం.మామునూరు విమానాశ్రయం నిర్మాణంతో పాటు.. ఈ ప్రాంతంలో భవిష్యత్‌లో భూసేకరణ కార్యక్రమాలు కూడా వ్యాపార ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అయితే.. గత మూడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ కోసం నోటిఫికేషన్లు జారీ చేసి.. రూ.205 కోట్ల కేటాయింపులు చేసిన తర్వాత.. ఈ ప్రాంతం రియల్ ఎస్టేట్ మార్కెట్ మరింత వేగంగా అభివృద్ధి చెందినట్లు వలు రిపోర్టులు చెబుతున్నాయి.మామునూరు విమానాశ్రయ చరిత్రను మాట్లాడితే.. 1930లో నిజాం హయాంలో నిర్మించబడిన ఈ విమానాశ్రయం.. వివిధ కారణాలతో 1980లో మూతపడింది. నిజాం కాలంలో 1,875 ఎకరాలు కేటాయించిన ఈ భూములలో.. తాజాగా 253 ఎకరాలు అదనంగా అవసరమవుతుందని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ విమానాశ్రయ ఏర్పాటుతో, మామునూరు మరియు దాని పరిసర ప్రాంతాలలో కనెక్టివిటీ పెరగడం మాత్రమే కాకుండా, పెద్ద పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఈ ప్రాంతానికి రాగలవు. దాంతో.. ఇక్కడ సాంకేతిక, వాణిజ్య, ఆర్థిక రంగాల్లో భారీ మార్పులు రావడం ఖాయం. ఈ ప్రాజెక్టు పూర్తి అయిన తరువాత, మామునూరు ప్రాంతం ఆదాయాన్ని పెంచుకోవడం, ఆదాయ మార్గాలు విస్తరించడం, అలాగే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రేరణ కాబోతుంది. ఇది కాకుండా.. భవిష్యత్‌లో పరిశ్రమలు, సాంకేతిక కేంద్రాలు, అలాగే ఎగుమతులు, దిగుమతులు కూడా పెరిగి.. ఇక్కడ వ్యాపార వాతావరణం మరింత పోటీగా మారనున్నాయి.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక మరింత ఆలస్యం


హైదరాబాద్ : బీజేపీ తెలంగాణ అధ్యక్షుని నియామకం మరింత ఆలస్యమయ్యేలా ఉంది. ముందుగా పార్టీ నేతలు పేర్కొన్న ప్రకారం ఈనెల రెండో వారంలోపు నియామకం చేపట్టాల్సి ఉంది. అయితే ఎవరిని నియమించాలనే అంశం అధిష్ఠానానికి తలనొప్పి వ్యవహారంగా మారిందని తెలుస్తోంది.గతంలో ఎప్పుడు లేనంత పోటీ నెలకొన్న నేపథ్యంలో అధ్యక్ష పదవికి పైర వీలు, ప్రయత్నాలు భారీగా పెరిగాయ ని తెలుస్తోంది. అందుకే ఎవరిని అధ్యక్షున్ని చేయాలనే అంశంపై పార్టీ పెద్ద లు సమాలోచనలు చేస్తున్నారని పార్టీ శ్రేణులు అంటున్నాయి. ఈ నెలాఖరులోపు కొత్త అధ్యక్షుడిని నియమిస్తా రని ప్రచారం కొనసాగుతోంది.ప్రస్తుతం తెలంగాణలో బీసీవాదంపైనే ప్రధానంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో అధ్యక్ష ఎన్నికపై పార్టీపెద్దలు ఆలోచనలో పడ్డారని అంటున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లతో పెద్దగా సత్తా చాటలేకపోయిన బీజేపీ, పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఏకంగా 8 సీట్లు గెలుచుకొని ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్‌కు సవాల్ విసిరింది.తాజాగా జరిగిన 3 ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీని కూడా కోల్పోగా, బీజేపీ ఏకంగా రెండు సీట్లు సాధించి సత్తా చాటింది. ఇక బీఆర్ఎస్ కనీసం పోటీ కూడా చేయలేకపోయింది.గెలుపు గుర్రం లాంటి పార్టీకిరాష్ట్ర అధ్యక్షుడి సీటు అంటే ఎంత పోటీ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.ఈ నేపథ్యంలోనే ఈపీఠంపై కన్నేసిన నేతలు.. ఢిల్లీలోని పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.దీనికి తోడు కీలకమైన రాష్ట్రంలో ఎవరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుదనే విషయంలో పార్టీ అధిష్ఠానం సైతం రొటీన్‌గా కొందరిపైనే ఆధారపడకుండా వివిధ మార్గాల ద్వారా నివేదికలు తెప్పించుకొని అధ్యయనం చేస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే బీజేపీ తెలంగాణ అధ్యక్షుడి ఎంపిక ఆలస్యమవుతోందని అంటున్నారు. మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక ఏప్రిల్ మొదటి వారంలో ఉంటుందని పార్టీ నేతలు చెబుతున్నారు.

## హనీట్రాప్ లో ఆర్డినెన్స్ ఉద్యోగి

లక్నో : ఉత్తరప్రదేశ్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ ఆయుధ కర్మాగారానికి చెందిన ఉద్యోగిని అదుపులోకి తీసుకుంది. ఫిరోజాబాద్‌లోని హజ్రత్‌పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఛార్జ్‌మెన్ రవీంద్ర కుమార్‌ను అరెస్టు చేసింది. పాకిస్తాన్‌కు చెందిన మహిళా ఏజెంట్ ఉచ్చులో చిక్కుకుని రహస్యాలను చేరవేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అతను ఆర్మీ, ఇస్రోకు సంబంధించిన రహస్య సమాచారాన్ని పాకిస్తాన్ నిఘా సంస్థ ఏజెంట్‌కు పంపుతున్నాడు. ఈ కేసులో ఏటీఎస్ కి రహస్య సమాచారం అందింది. దాని ఆధారంగా దర్యాప్తు నిర్వహించి రవీంద్ర కుమార్ తోపాటు అతని సహచరుడిని అరెస్టు చేశారు. ఆ మహిళ పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఏజెంట్‌గా పని చేస్తున్నట్లు జఖ ఏటీఎస్ పేర్కొంది.పోలీసుల విచారణలో ఆగ్రాలోని బుండు కాట్రా ప్రాంతానికి చెందిన రవీంద్ర కుమార్ 2006 నుండి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు వెల్లడైంది. అతను 2009 నుండి ఫిరోజాబాద్‌లోని హజ్రత్‌పూర్ ఫ్యాక్టరీలో ఛార్జ్‌మన్‌గా నియమితుడయ్యాడు. అయితే నేహా శర్మగా నటిస్తూ గత ఏడాది ఫేస్‌బుక్ ద్వారా రవీంద్రను సంప్రదించింది. తాను పాకిస్తాన్ నిఘా సంస్థలో పనిచేస్తున్నట్లు వెల్లడించినప్పటికీ, ఆమె అతడిని హనీ ట్రాప్‌లో పడేయగలిగింది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి సంబంధించిన సున్నితమైన పత్రాలను ఆమెకు చేరవేసినట్లు తెలుస్తోంది. అతను రోజువారీ నివేదికలు, స్క్రీనింగ్ కమిటీ నుండి రహస్య లేఖలు, పెండింగ్‌లో ఉన్న అభ్యర్థన జాబితా, డ్రోన్‌లు, గగన్‌యాన్ ప్రాజెక్ట్ వివరాలతో సహా అత్యంత రహస్య సమాచారాన్ని పాక్ మహిళ ఏజెంట్‌తో పంచుకున్నాడని దర్యాప్తులో వెల్లడైంది. రవీంద్ర తన నంబర్‌ను చందన్ స్టోర్ కీపర్ 2 పేరుతో సేవ్ చేసుకున్నాడని, వారి లావాదేవీలను దాచిపెట్టాడని కనుగొన్నారు. ఆర్థిక ప్రోత్సాహకాలతో ప్రేరేపించిన, అతను వాట్సాప్ ద్వారా ఆమెకు రహస్య పత్రాలను పంపాడని నిర్ధారించారు.సోదాల సమయంలో, యుపి ఎటిఎస్ రవీంద్ర మొబైల్ ఫోన్‌లో సున్నితమైన సమాచారాన్ని కనుగొంది. వాటిలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, 51 గూర్ఖా రైఫిల్స్ రెజిమెంట్ సీనియర్ అధికారులు నిర్వహించిన లాజిస్టిక్స్ డ్రోన్ ట్రయల్స్ గురించిన రహస్య వివరాలు ఉన్నాయి. అతను పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ హ్యాండ్లర్లతో ప్రత్యక్ష సంభాషణను కొనసాగించాడని, భారతదేశ రక్షణ ప్రాజెక్టులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని అందజేశాడని అధికారులు చెబుతున్నారు. అతని అరెస్టు తర్వాత, ఏటీఎస్ అధికారులు ఆగ్రా నుండి రవీంద్ర సహచరులలో ఒకరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వాట్సాప్ చాట్‌లు, వర్గీకృత పత్రాలతో సహా డిజిటల్ ఆధారాలను ఏజెన్సీ స్వాధీనం చేసుకుంది. వీటిని ఇప్పుడు దర్యాప్తులో భాగంగా విశ్లేషిస్తున్నారు.

# కోట్లు ఖర్చు పెడుతున్నా... జాడ ఏదీ?

మహబూబ్ నగర్ : శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ ప్రమాదంలో కార్మికుల జాడ తెలుసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మృతదేహాల కోసం రెస్క్యూ ఆపరేషన్ నేటికి 21వ రోజుకు చేరుకుంది. ఏడుగురు మృతదేహాలను వెతికేందుకు నిరంతరం శ్రమిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ప్రభుత్వం రోజుకు రెస్క్యూ ఆపరేషన్ కు వినియోగించే రోబోల కోసం నాలుగు కోట్ల రూపాయలు వ్యయం చేస్తుంది. కేరళ నుంచి కడావర్ డాగ్స్ ను తెప్పించడం నుంచి రోబోలను తెప్పించి అన్వేషణ చేస్తున్నారు. మట్టి, బురద తవ్వకాలకు ఆటంకంగా మారింది. సొరంగంలో రెండు రోబోలు పనిచేస్తున్నాయి. కడావర్ డాగ్స్ గుర్తించిన డీ2, డీ1 పాయింట్లమధ్య పన్నెండు మీటర్ల దూరం ఉందని సహాయక బృందాలుత లిపాయి. ఈ ప్రాంతంలోనే టీబీఎం మిషన్ కూలిపోయింది. పైకప్పు విరిగిపడింది. ఈ ప్రాంతంలోనే మృతదేహాలు ఉంటాయని కడావర్ డాగ్స్ గుర్తించడంతో అక్కడ తవ్వకాలు జరిపేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. టీబీఎం మిషన్ ను కట్ చేస్తున్నారు. ఆ శిధిలాలను తొలగించి బయటకు తీసుకురావడం కూడా కష్టంగా మారడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది దీంతో పాటు కార్మికుల మృతదేహాలున్న చోట మాత్రం ప్రమాదకరమైన పరిస్థితులున్నాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అక్కడకు వెళ్లాలంటే రిస్క్‌తో కూడుకున్న వ్యవహారమని అంటున్నారు. అందుకే ఆచితూచి అడుగులు వేస్తున్నామని, అక్కడ హోలో స్పేస్ లో ఖాళీగా ఉన్న ప్రదేశంలోనే కార్మికుల మృతదేహాలున్నట్లు అంచనాకు వచ్చిన సహాయక బృందాలు అక్కడకు వెళ్లేందుకు రెండు రోబోలను ఉపయోగిస్తున్నాయి. షిఫ్ట్ లలో నిరంతరం పన్నెండు సహాయక బృందాలు పనిచేస్తున్నప్ప



టికీ ఫలితం కనిపించకపోవడంతో తదుపరి చర్యలపై చర్చలు జరుపుతున్నారు.ప్రధానంగా.. కేరళ కెడావర్ డాగ్స్ గుర్తించిన డీ-1, డీ-2 ప్రాంతాల్లో తవ్వకాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే.. మాన్యువల్ డిగ్గింగ్‌కు బదులుగా ఆటానమస్ హైడ్రాలిక్ పవర్డు రోబోలను వాడుతున్నారు. ఈ రోబో మోడ్రన్ టెక్నాలజీతో టన్నెల్ లోపల డిగ్గింగ్ ప్రక్రియ నిర్వహించనుంది. డిగ్గింగ్ ప్రక్రియలో ఏర్పడే మట్టిని వేగంగా బయటకు తీయడానికి సహాయపడతాయి. గంటకు 620 క్యూబిక్ మీటర్ల బురదతో కూడిన మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా తరలించనున్నారు అధికారులు. ఈ అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా ప్రత్యేకమైన యంత్రాలను ఉపయోగిస్తున్నారు. 30 హార్స్ పవర్ సామర్థ్యం గల లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంకుతో కూడిన మెషిన్‌లను కూడా టన్నెల్ లోపలికి పంపారు. ఈ యంత్రాలు మట్టిని త్వరగా తొలగించేందుకు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. మరోవైపు.. సహాయక చర్యలకు అడ్డుగా నిలిచిన టీబీఎం వెనక భాగాన్ని గ్యాస్ కట్టర్లు, ప్లాస్మా కట్టర్లు, అల్ట్రా థర్మల్ కట్టర్లో కత్తిరించి ఎప్పటికప్పుడు ఆ భాగాన్ని లోకో ట్రైన్ ద్వారా బయటకు పంపుతున్నారు.ఇక.. ఫిబ్రవరి 22న టన్నెల్‌లో ప్రమాదం జరగ్గా 8 మంది చిక్కుకుపోయారు. 16వ రోజున టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్ గురు ప్రీత్ సింగ్ మృతదేహాన్ని మాత్రమే వెలికి తీశారు. పార్థివ దేహాన్ని పంజాబ్లోని వారి కుటుంబ సభ్యులకు సైతం అప్పగించారు. మిగిలిన ఏడుగురి కోసం రెస్క్యూ ఆపరేషన్ కంటిన్యూ అవుతోంది. ఏడుగురి కార్మికుల జాడ కనిపెట్టేందుకు ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 12 రకాల సహాయక బృందాలు నిత్యం శ్రమిస్తూనే ఉన్నాయి.

## ఏ ఒక్కగ్రామంలో 100 శాతం రుణమాఫీ అయినా ముక్కు నేలకు రాస్తా

### - బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ : ఈ ప్రభుత్వం రైతు రుణమాఫీపై అబద్ధాలు చెబుతోందని జనగామ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అక్కడ 100 శాతం రుణమాఫీ చేసినం, ఇక్కడ 100 శాతం రుణమాఫీ చేసినం అని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని, తన జనగామ నియోజకవర్గంలో మాత్రం ఎక్కడా 100 శాతం రుణమాఫీ కాలేదని చెప్పారు. తన నియోజకవర్గంలో మొత్తం 127 గ్రామాలు ఉన్నాయని, ఆ 127 గ్రామాల్లో ఏ ఒక్క గ్రామంలో 100 శాతం రుణమాఫీ కాలేదని అన్నారు.తన నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలో అయినా సరే 100 శాతం రుణమాఫీ జరిగినట్లుగా ప్రభుత్వం నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి శపథం చేశారు. అంతేకాదు తాను తన ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని అన్నారు. వంద శాతం రుణమాఫీ చేశామని అబద్ధాలు చెప్పకుండా.. ఇంకా రుణాలు మాఫీ కాని రైతులకు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యాశాఖలో డ్రాపౌట్స్ పెరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో 2 లక్షల డ్రాపౌట్స్ నమోదయ్యాయని చెప్పారు. విద్యాసంస్థలకు నిధుల కేటాయింపులో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

# భద్రాద్రి అధ్యయనోత్సవాలకు ఏర్పాట్లు



ఖమ్మం : దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 12 వరకు శ్రీరామ నవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాల వివరాలను ఆలయ ఈవో రమాదేవి విడుదల చేశారు. ఈ నెల 30న ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణం, అంకురార్పణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేరోజు కల్పవృక్ష వాహనంలో స్వామివారికి ప్రత్యేక సేవ నిర్వహిస్తారు.మార్చి 31న తిరువీధి సేవ, ఏప్రిల్ 1న కూడా తిరువీధి సేవ కొనసాగిస్తామన్నారు. ఏప్రిల్ 2న గరుడ పటలేఖనం, 3న గరుడాధివాసం, 4న అగ్నిప్రతిష్ఠ, భేరీపూజ, దేవతాహ్వానం, హనుమంత వాహన సేవ ఉంటుందని ఈవో రమాదేవి చెప్పారు. 5న ఎదుర్కోలు వేడుక నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా మిథిలా మండపంలో కన్నుల పండువగా సీతారామ కల్యాణం ఉంటుందని అన్నారు. అదే రోజున భక్తులు శ్రీరామ దీక్షలు తీసుకుంటారన్నారు. ఇక కల్యాణం మరుసటి రోజు అంటే 7న మహా పట్టాభిషేకం, రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 8న సదస్యం, 9న తెప్పోత్సవం, చోరోత్స వం, 10న ఊంజల్ సేవ, 11న వసంతోత్సవం, 12న చక్రతీర్థం, పుష్పయాగంతో రామయ్య బ్రహ్మోత్సవాలకు పూర్ణా హుతి పలుకనున్నట్లు ఈవో రమాదేవి వెల్లడించారు.రామయ్య బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మార్చి నెల 30 నుంచి ఏప్రిల్ 12 వరకు నిత్య కల్యాణాలు ఉండవని ఈవో రమాదేవి ప్రకటించారు. మార్చి 30 నుంచి వచ్చే నెల 21 వరకు స్వామివారికి పవళింపు సేవలు కూడా ఉండవన్నారు. మే 3న భక్తులు శ్రీరామ దీక్షలను విరమిస్తారని చెప్పారు. అదే రోజున రథోత్సవం నిర్వహించున్నట్లు తెలిపారు. మే 4న సీతారామ పట్టాభిషేకం ఉంటుందని.. బ్రహ్మోత్సవాల తరుణంలో సంధ్యా హారతి వేడుక కూడా ఉండదన్నారు. ప్రతి రోజు తిరువీధి సేవలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆలయ పరిసరాల్లో 3.78 లక్షల ఎస్ఎఫ్‌టీ సామర్థ్యంతో తాత్కాలిక వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఏడు చోట్ల 60 తలంబ్రాల కౌంటర్లు, 5 చోట్ల 19 ప్రసాదాల కౌంటర్లను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. 2 వేల మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ఈవో వెల్లడించారు.

## తెలంగాణలో డీ లిమిటేషన్ సెగలు

హైదరాబాద్ : డీలిమిటేషన్‌పై దక్షిణాది జంగ్ సైరన్ మోగిస్తున్న వేళ.. తెలంగాణకు కూడా ఈ సెగలు తాకాయి. డీలిమిటేషన్ పై అఖిలపక్షం నిర్వహిస్తామని అధికార కాంగ్రెస్ అంటుంది. 22న స్టాలిన్ భేటీ కంటే ముందే తెలంగాణలో అఖిలపక్ష భేటీ ఉంటుందన్నారు సీఎం రేవంత్. కానీ.. మీటింగ్ ఎప్పుడు ఉంటుందో ప్రకటించలేదు. అయితే.. కాంగ్రెస్ నిర్వహించే అఖిలపక్ష భేటీకి తాము దూరంగా ఉంటామన్నాయి బీఆర్ఎస్, బీజేపీ. అంతేకాదు సర్కార్‌పైనే రివర్స్ ఎటాక్ చేస్తున్నాయి. తమిళ రాజకీయ ట్రాప్‌లో వద్దారని విమర్శలు గుప్పిస్తున్నాయి.డీలిమిటేషన్ అనేది అసలు చర్చించే అంశమే కాదు.. అఖిలపక్షం పేరుతో అనవసర రాద్ధాంతం ఎందుకని ప్రశ్నిస్తోంది కమలం పార్టీ. 2026 తర్వాత పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీతో రాజ్యాంగ సవరణ జరిగిన తర్వాత.. అన్ని పార్టీల ఏకాభిప్రాయంతోనే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని బీజేపీ చెప్తుంది. కేంద్రంపై డీఎంకే విష ప్రచారం చేస్తుంటే.. దానికి కాంగ్రెస్ జత అయ్యిందన్నారు బీజేపీ ఎంపీ లక్ష్మణ్.లేని అంశంపై అఖిలపక్ష సమావేశం ఎందుకు అని ప్రశ్నించారు ఎంపీ లక్ష్మణ్. ముందు ఆరు గ్యారంటీలపై అఖిలపక్ష సమావేశం పెట్టాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలపై అఖిలపక్షానికి బీఆర్ఎస్ కూడా డిమాండ్ చేయాలన్నారు లక్ష్మణ్.ఇటీవల కూడా కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు రాబట్టడం కోసం అఖిలపక్షం నిర్వహించింది తెలంగాణ ప్రభుత్వం. కానీ.. రకరకాల రాజకీయ, రాజకీయేతర కారణాలు చూపుతూ రెండు ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ ఆల్ పార్టీ మీటింగ్‌కు డుమ్మా కొట్టాయి. ఇప్పుడు కూడా అఖిలపక్షానికి వెళ్లేది లేదని తెగేసి చెప్పాయి. మొన్నటి ఆల్ పార్టీ మీటింగ్‌కు మజ్లిస్ నుంచి అసదుద్దీన్ తప్పిస్తే.. విపక్ష ఎంపీ ఒక్కరు కూడా హాజరు కాలేదు. ఇప్పుడు డీలిమిటేషన్ పేరుతో.. మళ్లీ మరో అఖిలపక్షానికి రెడీ అయింది కాంగ్రెస్. మరి ఈ సమావేశానికి ఎవరు హాజరవుతారు, ఎప్పుడు నిర్వహిస్తారన్నది.. హాట్ టాపిక్‌గా మారింది.

## మట్టిలో మాణిక్యం పోలగాని శ్వేత గౌడ్

■ వరుసగా గ్రూప్ 1,2,3 జాబ్ లకు ఎంపిక

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**




నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మారుమూల ప్రాంత మాటూరు గ్రామానికి చెందిన పొలగాని నరసింహ గౌడ్, వెంకయమ్మ దంపతుల కూతురు శ్వేత ఒకే సంవత్సరం వరుస ఫలితాలలో గ్రూప్-1లో467 మార్కులు, గ్రూప్2లో412 స్టేట్ ర్యాంక్, గ్రూప్3లో 271 స్టేట్ ర్యాంక్ లతో వరుసగా దూసుకుపోతుంది.

3 నెలల కిందట గ్రూప్ 4 పరీక్షలో ఎంపిక అయి మిర్యాలగూడ నియోజకవర్గంలోని అడవిదేవులపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో జాబ్‌లో చేరారు. వరుస ఫలితాలలో అన్ని జాబ్‌లు ఎంపిక వడంతో పాటు రాష్ట్ర స్థాయిలో అత్యున్నత సర్వీస్ అయిన గ్రూప్1 లో మంచి మార్కులు పొదడం సంతోషకరంగా వుందని 467 మార్కులకు మంచి సర్వీస్‌కు ఎంపిక అయ్యే అవకాశం ఉందని శ్వేత తెలిపారు. మారుమూల తండా గ్రామంలో పుట్టి కుటుంబంలో తల్లి,తండ్రి కుటుంబ సభ్యులు ఎవ్వరూ ఉన్నత చదువులు చదువుకోలేకపోయినా పట్టుదలతో ఈ విజయాలు సాధించినందుకు కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు,బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో ఆడపిల్లను పైచదువులకు పంపించడానికి ఆసక్తి చూపని సందర్భంలో తన ప్రతిభ మీద నమ్మకం ఉంచి నావిజయానికి కారణం అయ్యింది తన తల్లిదండ్రుల ప్రోత్సాహం అని, దేశ అత్యున్నత సివిల్ సర్వీస్‌ను సాధించడమే తన లక్ష్యమని తన తల్లిదండ్రులకు అదే నేను ఇచ్చే గొప్ప కానుక అని ఆమె తెలిపారు.

## హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా శ్రీను

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



టీజీపీఎస్సీ సోమవారం వెల్లడించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాలలో దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన శ్రీను అనే యువకుడు రాష్ట్ర స్థాయిలో 177 వ ర్యాంక్,జోన్ స్థాయిలో 48 వ ర్యాంక్ సాధించి వార్డెన్ ఉద్యోగానికి ఏంపికవ్వడం జరిగింది.ఈ విషయం తెలుసుకున్న సామాజిక వేత్త,చక్ర టీవీ ఎండి కొండలక్ష్మణ్ గౌడ్ ప్రసాద్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా కొండ లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ 10 వ తరగతి వరకు వీర్లపాలెం ప్రభుత్వపాఠశాలలో చదువుకొని ఇంటర్, డిగ్రీ, బిఈడి మిర్యాలగూడ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో వుండి చదువుకొని అదే బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఏంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



## రాజకీయ పార్టీల నాయకులతో సబ్-కలెక్టర్ సమావేశం

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

సబ్-కలెక్టర్ మిర్యాలగూడ వారి కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్నీ రాజకీయ పార్టీల అధ్యక్ష,కార్యదర్శులతో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రోజు వారీగా ఆన్లైన్ ద్వారా నమోదు అవుతున్న ఫామ్-6,7మరియు 8ల పరిష్కారం మరియు డూప్లికేట్ ఓటర్ల తొలగింపు మరియు నూతన ఓటర్ల నమోదు మరియు బూత్ లెవెల్ ఏజెంట్ల నియా మకం ఎన్నికలకు సంబంధించిన తదితర అంశాలపై సమావేశంలో చర్చించి హాజరైన వారి యొక్క సూచనలు మరియు సలహాలు పరిగణలోకి తీసుకొని,తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు మరియు మిర్యాలగూడ తహసిల్దార్,డిప్యూటీ తహసిల్దార్ లతోపాటు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ఓయూలో ఆంక్షలు ఎత్తివేయాలి

■ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి

**వేద న్యూస్, హన్మకొండ :**



ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళనలను నిషేధిస్తూ విడుదల చేసిన జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్ర రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసే పని ప్రభుత్వం చేస్తోందన్నారు. కక్షపూరిత రాజకీయ పాలన మానుకోవాలని తమ హక్కుల కోసం పోరాడే విద్యార్థులను అణగదొక్కేందుకు ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని నిర్బంధం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు జారీ చేసిన సర్క్యులర్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనేక ప్రజాస్వామ్య ఉద్యమాలకు ఓయూ వేదికగా ఉన్నదని, విద్యార్థులు తమ సమస్యల పరిష్కారానికి, రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలుకు ఉద్యమాలు నిర్వహిస్తారనే కనీస అవగాహన లేకుండా సర్క్యులర్ జారీ చేయడం అధికారుల అజ్ఞానానికి నిదర్శనమని ఓయులో ఆందోళన వద్దనే జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆర్థిక వ్యూహాలతోనే సమాజ పురోభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

తెలియజేసారు. ఈ ముగింపు సమావేశంలో అనేకమంది వక్తలు,విద్యార్థులు అర్థశాస్త్రంపై పత్రసమర్పణ చేశారు.కార్యక్రమం చివరలో ఈ రెండురోజులకు భోజన సదుపాయాన్ని కలిగించిన మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కి ప్రత్యేక కృతజ్ఞతలు మరియు సెమినార్ కిట్ దాతలైన రాపోలు భాస్కర్ కి సెమినార్ సమవయకర్త డా.నరేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులునూకల వేణుగోపాల్ రెడ్డి,మునిసిపల్ కౌన్సిలర్లు,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,పలువురు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

■ 3 గ్రూపులుగా 59 కులాలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ఎస్సీ వర్గీకరణ హేతుబద్ధీకరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. 59 ఎస్సీ కులాలను 3 గ్రూపులుగా వర్గీకరిస్తూ మంగళవారం బిల్లు ఆమోదించారు. గ్రూప్-1లోని అత్యంత వెనుకబడిన 15 కులాలకు 1 శాతం రిజర్వేషన్, మాదిగలున్న గ్రూప్-2లోని కులాలకు 9 శాతం రిజర్వేషన్లు, మాలలు ఉన్న గ్రూప్-3లోని కులాలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో ఏ ఒక్కరికీ అన్యాయం జరకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతోమంది ప్రాణాలు అర్పించారన్నారు. తాను సీఎంగా ఉన్నప్పుడు సమస్య పరిష్కారం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సులు



చేసిందని వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించిందని, దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగిందని, దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారని అన్నారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించిందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించామని అన్నారు. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించామని, మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించామని, కమిషన్ ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించిందని వివరించారు. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించామని, 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించిందని, 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కిలాడీ ముఠా అరెస్ట్

■ మత్తిచ్చి.. పడుపు రొంపిలోకి నెట్టివేత
■ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ సాయంతో బాలిక ట్రాప్
■ ఉమ్మడి వరంగల్ జిల్లాలో దారుణం
■ బాధితురాలి సమాచారంతో కేసు ఛేదించిన ఖాకీలు

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

వరంగల్ నగరంలోని ఓ బాలికను అపహరించి లైంగికదాడికి పాల్పడిన అనంతరం వ్యభిచారం చేయించేందుకు యత్నిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను మిల్స్‌కాలనీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఒక బాలిక, ఒక మహిళ, నలుగురు వ్యక్తులు ఉన్నారు. వీరి నుంచి పోలీసులు ఒక కిలో ఎనిమిది వందల గ్రాముల గంజాయితో పాటు ఒక కారు, రూ.75 వేల నగదు, 4 సెల్ ఫోన్లతో పాటు ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద భారీ స్థాయిలో కండోమ్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు.

ఈ నెల 11న ఓ బాలిక కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సదరు బాలికను ములుగు క్రాస్ రోడ్డు వద్ద గుర్తించి.. బాలికను పోలీసుల సంరక్షణలో తీసుకోని విచారించారు. తనను కొంత మంది వ్యక్తులు



అపహరించి, గంజాయి తాగించిన అనంతరం తనపై లైంగికదాడి చేసినట్టు సదరు బాలిక పోలీసులకు తెలిపారు. అప్రమత్తమైన పోలీసులు పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు సెంట్రల్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో వరంగల్ ఏసీపీ అధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసిన నిందితులను పట్టుకొని విచారణ కొనసాగించారు.

ఈ వ్యవహారంలో ప్రధాన నిందితురాల్కైన కిలాడీ ముస్కు లత హనుమకొండ జిల్లా ల్యాదెళ్ల పడుపు వృత్తిని కొనసాగిస్తున్నారు. తల్లిదండ్రులు మరణించడంతో ఓ మైనర్‌కు తన ఇంటిలోనే ఆశ్రయం కల్పించింది. ప్రధాన నిందితురాలు వ్యభిచార వృత్తి కొనసాగిస్తుండంతో తన వృత్తిలో అవసరమైన కొత్త మహిళలు లేదా బాలికలను తీసుకొచ్చి ఈ వ్యభిచారం నిర్వహించడం ద్వారా పెద్ద మొత్తం డబ్బు వస్తాయని, దానితో కొంత డబ్బు ఇస్తానని మైనర్‌కు చెప్పింది. దీనికి సిద్ధపడిన మైనర్ తన స్నేహితరాలితో పరిచయమైన బాధిత బాలికను లక్ష్యంగా చేసుకొని .. ఇన్‌స్టా గ్రామ్ ద్వారా బాధిత బాలికతో పరిచయం పెంచుకోవడమే కాకుండా బాలిక స్కూల్ వెళ్లే సమయంలో బాధిత బాలికను కలవడంతో పాటు మైనర్ ప్రియుడ్కైన నిందితుడు అబ్దుల్ అఫ్నాన్‌తో కలిసి బాలికను తీసుకవెళ్లి మద్యం, గంజాయిని తాగటం అలవాటు చేసారు. నిందితురాలిపై మరింత నమ్మకం కలిగేందుకు బాలికకు షాపింగ్ మాల్స్‌కు తీసుకవెళ్లి బట్టలను ఇప్పించడంతో వీరిపై నమ్మకం కలగడంతో.. సదరు బాధిత బాలిక వీరిని నమ్మి ఈ నెల 11న బాలికను నిందితురాలు తన ప్రియుడుతో మరో ఇద్దరు నిందితుల్కైన షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్‌లతో కలిసి కారులో బయలుదేరి గంజాయి విక్రయాలు చేసే మీర్జా ఫైజ్ బేగ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి.. నర్సంపేట శివారు ప్రాంతంలో నిందితుల్లో ఒకడ్కైన షేక్‌సైలాని బాబాకు చెందిన ఓ పురాతన ఇంటిలో బాధిత బాలికను తీసుకవెళ్లి గంజాయి త్రాగించి షేక్ సైలాని బాబా బాలికపై లైంగిక దాడి చేశారు.

### చెప్పినట్టు వినకుంటే వీడియో లీక్ చేస్తామని బెదిరింపులు

అనంతరం బాలికను 'చెప్పినట్లుగా వినాలి లేకుంటే నువ్వు గంజాయి త్రాగుతుండగా, అత్యాచారం చేసేది సెల్‌ఫోన్లో చిత్రికరించామని (వాస్తవంగా వీడియా తీయలేదు)ఈ వీడియోను బయట పెడతాము' అని బెదిరించి సదరు బాలికను ములుగు క్రాస్ రోడ్డు వదిలి అక్కడి నుండి పారిపోయారని నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించారు. కాగా నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా,వరంగల్ ఏసిపి నందిరాం నాయక్, మిల్స్ కాలనీ ఇన్స్‌స్పెక్టర్ వెంకటరత్నం,ఎస్.ఐలు శ్రీకాంత్, సురేష్‌లతో పాటు ఇతర పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## సెక్రెటరీల సమస్యలపై తీర్మానాలు

■ పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యవర్గ సమావేశం

**వేద న్యూస్, హనుమకొండ :**



హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ భవన్‌లో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జనుగాని అశోక్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. మీటింగ్ లో పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి చర్చించి తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయి పంచాయతీ కార్యదర్శుల సమస్యలను టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుటకు కృషి చేస్తానని తెలిపారు. ట్రెజరీలో ఉన్న పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, గ్రామ పంచాయతీ లకు నిధులు కేటాయించాలని సమావేశంలో తీర్మానించారు. జేపీఎస్‌ల నియామక తేదీ నుంచి సర్వీస్ లెక్కిస్తూ.. రెగ్యులరైజ్ కాలాన్ని నాలుగేండ్ల నుంచి రెండేండ్లకు తగ్గించి ప్రొహిబిషన్ డిక్లేర్ చేయాలని, అన్ని జీపీలకు ఫండ్స్ కేటాయించాలి.. కేడర్ స్ట్రెంత్ పెంచాలి.. కేడర్ కేటాయించాలని, గ్రేడ్ 1,2,3,4 ఖాళీలను గుర్తించాలి.. రెండేండ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరకీ ప్రమోషన్లు కల్పించాలని, ఓపీఎస్ లను జేపీఎస్‌లుగా రెగ్యులరైజ్ చేయాలని తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సోమ న్న,గౌరవ అధ్యక్షుడు శ్యామ్, కేంద్ర సంఘం సభ్యులు లక్ష్మీ ప్రసాద్,మోయిజ్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎండీ. రఫీ,జాయింట్ సెక్రెటరీ వెంకటేశం,ఈ.సి.మెంబర్ ఆర్శం శ్రీనివాస్,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వెంకన్న గౌడ్,కోశాధికారి రాయకంటి రాజు, ఉపాధ్యక్షులు మనోహర్, కిషోర్,జాయింట్ సెక్రటరీ లు లావణ్య,భాస్కర్,ఆర్గనైజింగ్ సెక్రటరీలు శివ శంకర్, ప్రవళిక, రఘు, యాదగిరి, వేణు మాధవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం

మొదటి పేజీ తరువాయి

ఆదాయం తగ్గిన అప్పులు పెరిగిన ధైర్యంతో ముందడుగు వేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ యువత ఉపాధికి సన్నద్ధమైందని అన్నారు. గత ప్రభుత్వం యువతను పట్టించుకోకపోవడంతో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు జరిగిందని, అలా అంటే నష్టం జరగకూడదని తమ ప్రభుత్వం రూ.6000 కోట్ల ప్రణాళికతో రాజీవ్ యువ వికాస్ కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. 50 వేల నుంచి 4 లక్షల వరకు రాజీవ్ యువ వికాసం రుణాలు అందజేయడం జరుగుతుంది. రాజీవ్ యువ వికాసం పథకం క్రింద 50 వేల నుంచి నాలుగు లక్షల మంజూరు కి దరఖాస్తులు ప్రక్రియ ప్రారంభమైందని శ్రీకాంత్ అన్నారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి నాలుగు నుంచి ఐదు వేల మందికి ఉపాధి కలిగించే అవకాశం ఉందని అన్నారు. ఏప్రిల్ 4 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు అప్లై చేసుకోవచ్చని ఏప్రిల్ 6 నుంచి 30 వరకు లబ్ధిదారుల ఎంపిక యూనిట్ల మందులు ఉంటుందని జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తామని అన్నారు. నిజమైన నిరుద్యోగులకు ఈ పథకం అందాలనే లక్ష్యంతో ప్రజల పథకంగా దీనిని ముఖ్యమంత్రి పేర్కొన్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యువ వికాస పథకాన్ని ఉపయోగించుకుని యువత ఉపాధి కల్పించుకోవాలని ఈ సందర్భంగా శ్రీకాంత్ కోరారు.



## వీడ లేమంటూ.. విడిపోతున్నమంటూ..

పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

బాల్య దశలో పాఠశాలలో చేరి ఆడి పాడి గడిపిన విద్యార్థులు పదవ తరగతి పూర్తి కావడంతో తొమ్మిదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు వీడలేమంటూ వీడిపోతున్నమంటూ ఆడిపాడి ఆనందంగా గడిపారు.ఈ కార్యక్రమం త్రిపురారం మండలంలోని చెన్నైపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. పాఠశాలలో చదివి పదవ తరగతి పూర్తి చేసి వెళ్ళిపోతున్న విద్యార్థులు రోదిస్తూ వీడ్కోలు పొందారు.వారిని చూసి మిగిలిన విద్యార్థులు కంటతడి పెట్టారు.ఇంకొంత మంది విద్యార్థులు ఓదార్చారు.ఏదైనా పాఠశాల జీవితం మరువలేనిదని,అది మళ్ళీ రాదని పదవ తరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు మంచి కోర్సులు తీసుకొని జీవితంలో స్థిర పడాలని ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి కోరారు.ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు సత్యనారాయణ, సైదయ్య,నరసింహ స్వామి, లక్ష్మి, మాలోత్ దశరథ్ నాయక్, శ్రీనివాస్, విజయలక్ష్మి, ఝాన్సి, నరేందర్, లలిత, నీలిమ, తిరుపతమ్మ, రాము, సరస్వతి పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, W arangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, W arangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073